
ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో జాగృతిలో చేరిన కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎదురుగట్ల సంపత్‌గౌడ్

## జాగృతిలో చేరిన జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్

కామారెడ్డి / లింగంపేట, డిసెంబర్ 10 : కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎదురుగట్ల సంపత్‌గౌడ్ మంగళవారం తెలంగాణ జాగృతిలో చేరారు. హైదరాబాద్‌లో తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.. కండువా కప్పి సంస్థలోకి ఆహ్వానించారు. జాగృతి ఆశయాలు, లక్ష్యం కోసం అంకితభావంతో పనిచేయాలని సూచించారు. తనను సంస్థలోకి ఆహ్వానించిన కవితకు సంపత్‌గౌడ్ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అయాచితం శ్రీధర్, తెలంగాణ ఫుడ్ రాష్ట్ర మాజీ చైర్మన్ రాజీవ్ సాగర్, జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, నరేందర్ యాదవ్, ఈగ సంతోష్, లలితా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


రామారెడ్డి మండలం వజ్జేపల్లి తండాలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

- తెలంగాణ తల్లి విగ్రహం రూపురేఖలు మార్చడంపై బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం
- ఉమ్మడి జిల్లాలో తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు

# నిరసనల వెల్లువ

**రాష్ట్రప్రభుత్వం** తెలంగాణ తల్లి విగ్రహం రూపురేఖలు మార్చడంపై ఉమ్మడి నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. ఊరూరా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా తెలంగాణ తల్లి విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు మంగళవారం క్షీరాభిషేకాలు చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో అంబేద్కర్ విగ్రహానికి నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సదాశివనగర్ మండలం వజ్జేపల్లి తండాలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాల్గొన్నారు. బిచ్కుంద మండల కేంద్రంలోని కమ్మరి చెరువు కట్టపై ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారితే ప్రజల తలరాతలు మారాలని, మార్పు అంటే విగ్రహాలను మార్చడమేనా అని ప్రశ్నించారు.

నమస్తే తెలంగాణ యంత్రాంగం, డిసెంబర్ 10


బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

## ప్రజలను మభ్యపెడుతున్న రేవంత్ సర్కార్

- ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

రామారెడ్డి, డిసెంబర్ 10 : సీఎం రేవంత్‌రెడ్డి పాలన మీద దృష్టి పెట్టకుండా, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజలను మభ్యపెడుతూ కాలం వెళ్లదీస్తున్నాడని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. సదాశివనగర్ మండల వజ్జెపల్లి తండాలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం జాజాల మాట్లాడుతూ.. మలిదశ ఉద్యమ సమయంలో పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల వారు ఏకమై తెలంగాణ తల్లి విగ్రహాన్ని తమ సొంత డబ్బులతో గ్రామాల్లో ఏర్పాటుచేసుకున్నారని గుర్తుచేశారు. ప్రస్తుత రేవంత్ సర్కార్ పార్టీ గుర్తును హైలెట్ చేస్తూ అభయ హస్తం కనిపించేలా విగ్రహం తయారు చేసి సచివాలయం వద్ద ఆవిష్కరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇది తెలంగాణ సమాజాన్ని మోసం చేయడమే అన్నారు. తెలంగాణ జాతిపిత కేసీఆర్‌ను విమర్శించే హక్కు రేవంత్‌కు లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీనివాస్ నాయక్, శివాజీరావు, తాడ్వాయి, సదాశివనగర్ విండో చైర్మన్లు కమలాకర్ రావు, కపిల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ నర్సింహులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరిపాలనా దక్షత లేని సీఎం రేవంత్‌రెడ్డి

- రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

బాన్సువాడ, డిసెంబర్ 10 : పరిపాలనా దక్షత లేని సీఎం రేవంత్‌రెడ్డి పోలీసుల పహారాలో పాలన కొనసాగిస్తున్నారని, పోలీసులను అడ్డుపెట్టుకొని రాజ్యమేలుతున్నాడని రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ కొనసాగిందని గుర్తుచేశారు. బాన్సువాడ పట్టణంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి కార్యకర్తలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను అమలుచేసే దమ్ము లేక అనతికాలంలోనే రేవంత్‌రెడ్డి ప్రజావ్యతిరేకిగా మారాడని, మాజీ సీఎం కేసీఆర్‌పై అభాండాలు వేస్తూ టైంపాస్ చేస్తున్నాడని విమర్శించారు. ముఖ్యంగా తెలంగాణ వ్యతిరేకి రేవంత్ రెడ్డి తెలంగాణలో ఉండడం దురదృష్టకరమన్నారు. హామీలను పక్కదోవ పట్టించేందుకు ఒకసారి హైడ్రా, మరోసారి మూసీ ప్రక్షాళన, ఇప్పుడు తెలంగాణ తల్లి విగ్రహం మీద రాజకీయాలు చేస్తున్నాడని ధ్వజమెత్తారు. మూసీ ప్రక్షాళన రూ. 1.50 లక్షల కోట్ల ప్రణాళిక అయితే మొత్తం రాష్ట్ర బడ్జెట్ రూ.3 లక్షల కోట్లు అని, ఉద్యోగుల జీతాలు, సంక్షేమ పథకాల అమలు, రాష్ట్ర అభివృద్ధి ఇవన్నీ ఎలా జరుగుతాయని ప్రశ్నించారు. తెలంగాణ తల్లి విగ్రహ రూపును మార్చి, బంగారు నగలతో నిండుగా ఉండే తెలంగాణ తల్లిపై దొంగలు పడ్డట్టుగా చేశాడని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి

బాన్సువాడ నియోజకవర్గంలో బీఆర్ఎస్ కార్యకర్తలు రాబోయే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని బాజిరెడ్డి గోవర్ధన్ పిలుపునిచ్చారు. బాన్సువాడ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ నుంచి నిలిచిన వ్యక్తిని ప్రజలు గెలిపించారని, అనంతరం అధికార పార్టీలో చేరారని విమర్శించారు. బాన్సువాడ ప్రజలు ఈ విషయంలో ప్రస్తుతం బాధపడుతున్నారని అన్నారు. కష్ట కాలంలో పార్టీని మోసం చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు షేక్ జుబేర్ , మోచి గణేశ్, చాకలి సాయిలు, అఫ్రోజ్, మహేశ్, విద్యార్థి సంఘం నాయకులు సాయిబాబా, లక్ష్మణ్, రమేశ్ యాదవ్ పాల్గొన్నారు.


బిచ్కుంద మండల కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

## ప్రభుత్వానికి ప్రజలంటే గౌరవం లేదు

- జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

బిచ్కుంద, డిసెంబర్10: కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలంటే గౌరవం లేదని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. ఏడాదికాలంలో నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. బిచ్కుంద మండల కేంద్రంలోని కమ్మరిచెరువు కట్టపై ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి ఆయన క్షీరాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా మంజూరుచేసిన పనులనే ప్రస్తుతం ఎమ్మెల్యే అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పుకుంటున్నాడని అన్నారు. కొత్తగా ఎలాంటి పనులు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. తెలంగాణ ఉద్యమంలో అందరినీ ఏకతాటిపై తీసుకువచ్చి కవులు, కళాకారులు, విద్యావంతులతో చర్చించిన తర్వాతనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీకి విగ్రహం మార్చాలనే ఆలోచన రాలేదని, ఇప్పుడు ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజల దృష్టి మరల్చడానికే హైడ్రా, కాంగ్రెస్ తల్లి విగ్రహ ఏర్పాటు కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రావు దేశాయ్, బస్వీపటేల్, నాల్చర్ రాజు, విండో చైర్మన్ నాల్చర్ బాలాజీ, డాక్టర్ రాజు, విండో వైస్ చైర్మన్ యాదారావు, రాజు పటేల్, రాంచందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తల్లిని మార్చిన దుర్మార్గులు ప్రపంచంలో ఎక్కడాలేరు

- మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్

ఖలీల్‌వాడి, డిసెంబర్ 10 : తల్లిని మార్చిన దుర్మార్గులు ప్రపంచంలో ఎక్కడాలేరని, అది కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఉన్నారని మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి నగర మేయర్ నీతూకిరణ్, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుతో కలిసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆలిని మార్చిన దుర్మార్గులు ఉంటారని, కానీ తల్లిని మార్చిన మూర్ఖులు ప్రపంచంలో ఎక్కడా లేరన్నారు. ఉద్యమ సమయంలో వేల కొద్దీ తెలంగాణ తల్లి విగ్రహాలను ఊరూరా ఏర్పాటు చేశారని తెలిపారు.

ఎవరు అభ్యంతరం చెప్పారని తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలను మార్చారని ప్రశ్నించారు.? ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రజల తలరాతలు మారాలి తప్ప, తల్లులను మార్చడం అతిపెద్ద తప్పు అని పేర్కొన్నారు. బతుకమ్మను మాయం చేయడం తెలంగాణ అస్తిత్వంపై జరుగుతున్న దాడికి పరాకాష్ట అని అన్నారు. తెలంగాణ తల్లి ఒక పార్టీకో, వ్యక్తికో సంబంధించినది కాదన్నారు. జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు మాట్లాడుతూ.. 2007లో కవులు, కళాకారులు, మేధావులు, పండితులు చర్చించి, ఉద్యమానికి ప్రతీకగా కేసీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి రూపకల్పన చేశారని గుర్తుచేశారు. విగ్రహాల మార్పు వెనుక ఏదో కుట్ర ఉన్నట్లుగా భావిస్తున్నామన్నారు. ప్రజలకోసం ఏమైనా చేస్తారా లేక తెలంగాణను లేకుండా చేస్తారా అని నగర మేయర్ నీతూకిరణ్ మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సిర్ప రాజు, రాంకిషన్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, సుజిత్ సింగ్ ఠాకూర్, రవిచందర్, సత్యప్రకాశ్, తెలంగాణ శంకర్, నవీద్ ఇక్బాల్, సంతోష్, మహేందర్, శంకర్, శేఖర్, రాజు, శంకర్, రాజు, ప్రసాద్, రవి, రమేశ్, అనిల్, విజయ్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.


జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, బీఆర్ఎస్ శ్రేణులు



ఆశ కార్యకర్తలను బిచ్కుంద పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు

## 'ఆశ'ల నిర్బంధం

- హైదరాబాద్‌కు వెళ్లకుండా అడ్డగింత
- ఉమ్మడి జిల్లాలో ముందస్తు అరెస్టులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, డిసెంబర్ 10: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్‌కు వెళ్తున్న ఉమ్మడి జిల్లాలోని ఆశ కార్యకర్తలను మంగళవారం పోలీసులు అడ్డుకున్నారు. బోధన్, ఎడపల్లి, ఎల్లారెడ్డి, బిచ్కుంద, నస్రుల్లాబాద్, సిరికొండ, మండలాల్లో ఆశ కార్యర్తలను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన ఆశ కార్యకర్తలను సీఐటీయూ నాయకులు కలిసి మద్దతు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఆశ కార్యకర్తలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్, ఆరోగ్య బీమా, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చి ఇంతవరకూ అమలు చేయలేదన్నారు.


అరెస్టు చేసిన అనంతరం బోధన్ పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు


పోలీసులు పట్టుకున్న ఇసుక లారీ

# పెద్దవాగును తవ్వేస్తున్నారు..

- గాండ్లపేట్ నుంచి జోరుగా ఇసుక అక్రమ రవాణా
- గ్రామ కమిటీకి రూ.18 లక్షలు ఇవ్వాలని ఒప్పందం
- మోర్తాడ్ శివారులో తవ్వకాలు చేపట్టినందుకు రూ.5 లక్షల జరిమానా
- అధికారులకు రూ. లక్షల్లో ముడుపులు

మోర్తాడ్, డిసెంబర్ 10: మోర్తాడ్ మండలంలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో అనుమతులు లేకుండా యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. మండలంలోని గాండ్లపేట్ పెద్ద వాగు నుంచి రాత్రి సమయాల్లో జోరుగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇందుకోసం గ్రామకమిటీకి నెలకు రూ.18 లక్షలు చెల్లించాలనే ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుపడకుండా ఉండడానికి పోలీసులు, రెవెన్యూ అధికారులకు కూడా భారీ మొత్తంలో ముడుపులు ముట్టజెప్పుతున్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేదెవరని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### మోర్తాడ్ శివారులో వాహనం పట్టివేత

రాత్రుల్లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న నేపథ్యంలో గ్రామ కమిటీకీ భారీ మొత్తంలో నెలకు రూ.18 లక్షలు చెల్లించాలనే ఒప్పందం కుదిరితే ఇక అధికారులకు ఏ స్థాయిలో ముడుపులు ముడుతాయో అర్థమవుతున్నదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జాతీయరహదారిని ఆనుకుని రాత్రుల్లో ఇసుక అక్రమ రవాణా కొనసాగుతున్నా పోలీసులు చూసీచూడనట్లుగా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఇదిలా ఉండగా రాత్రి తరలించిన ఇసుకను మోర్తాడ్ శివారులోని వ్యవసాయ భూముల్లో డంప్ చేసి, మధ్యాహ్నం పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇలా తరలిస్తుండగా ఓ వాహనాన్ని మోర్తాడ్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. యథేచ్ఛగా ఇసుక రవాణా జరుగుతున్నా మండల, జిల్లా స్థాయి అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### తెల్లవారుజాము వరకు తవ్వకాలు

గాండ్లపేట్ శివారులోని పెద్దవాగు నుంచి రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టి, జోరుగా రవాణా చేస్తున్నారు. పొక్లెయిన్ పెట్టి మరీ ఇసుకను తోడేస్తున్నా.. సంబంధిత అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పెద్దవాగులో ఇసుకను పొక్లెయిన్‌తో తోడేస్తూ మోర్తాడ్ శివారులోకి వెళ్లడంతో మోర్తాడ్‌కు చెందిన వారు కూడా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారికి రూ.5 లక్షల జరిమానా విధించినట్లు తెలిసింది.

> **ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవు**
>
> మోర్తాడ్ మండలంలోని పెద్దవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవు. గాండ్లపేట్ పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. సిబ్బందిని పంపించే ఏర్పాట్లు చేశాను.
>
> -సత్యనారాయణ, తహసీల్దార్


మోర్తాడ్ శివారులో డంపు చేసిన ఇసుక

